క్లుప్తంగా

అప్పన్నకు నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు అక్షింతలు, శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

వైభవంగా మూడు గుళ్ల అమ్మవార్ల పరస



అమ్మవారి సన్నిధిలో గండి బాబ్జీ, భక్తులు

పెందుర్తి: చింతలగ్రహారంలో కొలువుదీరిన గ్రామదేవతలు మెట్టమాంబ, బండిమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరసను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెటగుళ్లు, సాముగరిడీలు, కోలాటాలు సందడిగా సాగాయి. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం అలరించింది. రంగులరాట్నాలు, వివిధ రకాల ఆట పరికరాలతో పిల్లలు సందడి చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, గ్రామ పెద్దలు, నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం అందిస్తున్న బోకం రామునాయుడు, కాసులమ్మ దంపతులు

సబ్బవరం: గుల్లేపల్లిలోని రామాలయం పునర్నిర్మాణానికి బోకం నాగంనాయుడు జ్ఞాపకార్థం ఆయన భార్య కుమారి రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందించారు. బోకం రామునాయుడు, కాసులమ్మ దంపతులు రూ.50 వేలు, ఆలయ ద్వారాల కోసం ఆరాధ్యుల శేషగిరి మాస్టారు రూ.లక్ష విరాళమిచ్చారు. ఈ విరాళాలను నిర్మాణంలో ఉన్న ఆలయం వద్ద ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బోకం రామునాయుడు, బండారు శ్రీనివాసరావు, గజ్జి దేముడుబాబు, ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాంజనేయశాస్త్రి తదితరుల సమక్షంలో అందించారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



గోతులమయమైన పినగాడి-వేపగుంట రోడ్డు



వేపగుంట సమీపంలోని చింతలగ్రహారం వద్ద అధ్వానంగా వేపగుంట-పినగాడి రహదారి



రైల్వే వంతెన వద్ద రోడ్డు



శ్రీరాంపురం వద్ద రోడ్డు దుస్థితి

రహదారీ తెన్నూ లేక..

రెండు మూడు రోజుల్లో వేపగుంట–పినగాడి రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ముందుగా జీవీఎంసీ పరిధిలో ఉన్న రోడ్డును పూర్తి చేసి, కొద్ది రోజుల్లోనే మిగిలిన రోడ్డు పనులను ప్రారంభిస్తాం. అతి త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– గత ఏడాది జూన్ 27న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇచ్చిన భరోసా

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ మేరకు 150 అడుగులకు విస్తరిస్తే మా బతుకులు రోడ్డున పడతాయి. ఉండేందుకు ఇళ్లు కూడా లేనివాళ్లమవుతాం. గతంలో చెప్పినట్లు 60–70 అడుగుల మేర రోడ్డును విస్తరిస్తే మాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అభివృద్ధికి మేం అడ్డుకాదు.

– పినగాడి, రాంపురం, వేపగుంట, చీమలాపల్లి, లక్ష్మీపురం వాసుల మొర

150 అడుగుల రోడ్డుతో మేం అభివృద్ధి చేద్దాం అనుకుంటున్నాం. కానీ మీరు అంత పెద్ద రోడ్డు వద్దని అడ్డుకుంటున్నారు. రోడ్డు విస్తరణ జరిగితే మిగిలిన స్థలాలకు అధిక ధరలు వస్తాయి. సహకరిస్తే మంచి ప్యాకేజీ వచ్చేలా చూస్తాను.. అడ్డుకుంటే నేనేం చేయలేను.

– మంగళవారం రాంపురంలోని ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల తాజా వ్యాఖ్యలు

- వేపగుంట–పినగాడి రోడ్డు విస్తరణపై ప్రభుత్వం నాన్చుడి ధోరణి
- ప్రజామోదం లేకుండా భారీ విస్తరణకు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టు
- అంత రోడ్డు వేస్తే రోడ్డున పడతామని వాపోతున్న స్థానిక నివాసులు
- ప్రస్తుతం పూర్తిస్థాయిలో శిథిలమైన రహదారి
- అడుగుకో గొయ్యి.. గజానికో గుంతతో ప్రజల ఇక్కట్లు

పెందుర్తి: నియోజకవర్గంలోని అత్యంత కీలకమైన రహదారుల్లో వేపగుంట–పినగాడి రహదారి ఒకటి. చోడవరం, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి ప్రాంతాల నుంచి నగరానికి చేరుకోవాలంటే ఇదే ప్రధాన మార్గం. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అలాంటి రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినా మరమ్మతులు చేపట్టేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీలో రూ.11 కోట్లు మంజూరు

ఈ రహదారిని పునర్నిర్మించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.11 కోట్లు నిధులు మంజూరు చేసింది. అప్పటి కాంట్రాక్టర్, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఏవేవో కారణాలు చూపి, రోడ్డు నిర్మాణం తాత్సారం చేస్తూ వచ్చారు. కనీసం మరమ్మతులైనా చేపడదామని జీవీఎంసీ ముందుకు వచ్చి రూ.1.50 కోట్లు మంజూరు చేసి, పనులు ప్రారంభించే సమయంలో ఆర్ అండ్ బీ అధికారులు కొర్రీ వేశారు. తమ పరిధిలోని రోడ్డుపై జీవీఎంసీ పెత్తనం ఏంటని నోటీసులు జారీ చేయడంతో జీవీఎంసీ తప్పుకుంది.

150 అడుగులకు వీఎంఆర్‌డీఏ ప్లాన్

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ ద్వారా ఈ రహదారిని 150 అడుగుల వెడల్పున విస్తరించేందుకు ప్రతిపాదించారు. దీంతో ఈ మార్గానికి ఇరువైపులా ఉన్న పినగాడి, రాంపురం, వేపగుంట, చీమలాపల్లి, లక్ష్మీపురం తదితర గ్రామాల ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. ఇంత భారీ స్థాయిలో విస్తరణ జరిగితే వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయంటూ ఆందోళనకు దిగారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌కు సైతం వినతిపత్రాలు అందించి, తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణ ప్రక్రియ మళ్లీ మొదటికే వచ్చింది.

ప్రయాణం నరకం

దాదాపు 10 కిలో మీటర్లున్న వేపగుంట–పినగాడి రహదారి పూర్తిగా గోతులమయం అయింది. అడుగడుగునా శిథిలమై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. వాహనాలు గోతుల్లో దిగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటుగా ప్రయాణం చేస్తున్న వారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే రోడ్డు మరమ్మతులు/పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మేమే మరమ్మతులు చేసుకుంటున్నాం



స్థానికంగా జేసీబీలు, ట్రాక్టర్లతో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తుంటాం. నిత్యం ఇదే మార్గంలో మా వాహనాలు నడుపుతుంటాం. రోడ్డు శిథిలావస్థకు చేరడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో మా సొంత నిధులు వెచ్చించి, రోడ్డులోని గోతుల్ని తాత్కాలికంగా మట్టితో కప్పుతున్నాం. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నాం. కానీ ఫలితం లేదు.

– సంతోష్, చింతలగ్రహారం

అభ్యంతరాలు వస్తున్నాయి



వేపగుంట–పినగాడి రహదారిని 150 అడుగుల వెడల్పున విస్తరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే దీనిపై కొన్ని గ్రామాల ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. ఇప్పటివరకు రోడ్డు విస్తరణ 150 కాకుండా కుదించాలని 92 అభ్యంతరాలు వచ్చాయి. వాటిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే దీనిపై ఓ స్పష్టత వస్తుంది.

– శిల్ప, చీఫ్ అర్బన్ ప్లానర్, వీఎంఆర్‌డీఏ

భూ నిర్వాసితుల రిలే నిరాహార దీక్ష విరమణ

- మారిటైం యూనివర్సిటీ ప్రతినిధులతో ఎమ్మెల్యే పంచకర్ల చర్చలు



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: మండలంలోని వంగలిలో మారిటైం విశ్వవిద్యాలయం ఎదుట నాలుగు రోజులుగా విశ్వవిద్యాలయ భూ నిర్వాసితులు, గ్రామస్తులు చేపట్టిన నిరసన, రిలే నిరాహార దీక్ష మంగళవారంతో ముగిసింది. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దీక్ష శిబిరాన్ని సందర్శించి, యూనివర్సిటీ యాజమాన్యంతో నిర్వాసిత రైతుల డిమాండ్లపై చర్చించారు. 12 డిమాండ్లలో నిర్వాసితులకు గతంలో హామీ ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.50 వేలు, గ్రామాభివృద్ధికి రూ.3 కోట్ల సాయం ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉందన్నారు. మిగిలిన 10 డిమాండ్లు గ్రామస్తుల న్యాయమైన కోర్కెలేనని, వాటిని సత్వరం పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. 15 రోజులలో యాజమాన్యం హెడ్ క్వార్టర్స్‌తో మాట్లాడి లిఖితపూర్వక హామీ పత్రాన్ని ఇవ్వాలన్నారు. లేకుంటే గ్రామస్తుల నుంచి నిరసన ఉధృతం అయితే తాము చేసేదేమీ లేదని యూనివర్సిటీ ప్రతినిధులను హెచ్చరించారు. నిర్వాసితులకు, గ్రామస్తులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ కేశవదేవ్, గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీహేమ, గ్రామ పెద్దలు ఆకుల గణేష్, తహసీల్దార్ చిన్నికృష్ణతో పాటు పలువురు గ్రామ పెద్దలు, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ప్లాస్టిక్ నిషేధం

పెందుర్తి: ప్లాస్టిక్‌తో అనేక అనర్థాలు ఉన్నాయని.. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి పిలుపునిచ్చారు. మంగళవారం పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా నార, గుడ్డ సంచుల్ని వినియోగించాలని సూచించారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి



జెర్రిపోతులపాలెం శిబిరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ అప్పలరాజు



నారపాడు వైద్య శిబిరంలో సర్పంచ్ మామిడి శంకరరావు, డాక్టర్ రామ్మోహన్‌రావు

- నారపాడులో లేగదూడల ప్రదర్శన

పెందుర్తి: జిల్లా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సుజాత సూచించారు. మండలంలోని జెర్రిపోతులపాలెంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ముందుగా కార్యక్రమాన్ని సర్పంచ్ మడక అప్పలరాజు ప్రారంభించారు. పశు వైద్య సిబ్బంది పశువులకు, గొర్రెలు, మేకలకు అవసరమైన వైద్య సేవలు అందించారు. నట్టల నివారణ మందులు వేశారు. వీఏ తనూజ, ఏహెచ్‌ఏ కృష్ణ, గోపాలమిత్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మామిడి శంకరరావు శిబిరాన్ని ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 22 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 23 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించారు. 10 చూడి పశువులకు తనిఖీలు నిర్వహించారు. 50 లేగదూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు అందించినట్లు ఆరిపాక పశు వైద్యురాలు డాక్టర్ ఎస్.స్వర్ణలత తెలిపారు. శిబిరంలో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు.

ఈ ప్రదర్శనలో సుమారు 40 లేగదూడల్ని పాడిరైతులు తీసుకొచ్చారు. ప్రథమ బహుమతి కరణం అచ్చియ్యమ్మ, ద్వితీయ బహుమతి మామిడి శంకరరావు, తృతీయ బహుమతి మామిడి ముత్యాలనాయుడు లేగదూడలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు, ఉప సంచాలకుడు డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఉషాకుమారి, పశు వైద్యులు జి.అరుణ, బి.సంధ్య, ఎస్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

చెరువు కబ్జాలో జనసైనికుడు

- కృష్ణరాయపురం జ్యోతినగర్ చెరువును చెరబట్టిన ఎమ్మెల్యే అనుచరుడు
- తప్పుడు పట్టాలతో షెడ్లు నిర్మించి రూ.20 లక్షల చొప్పున అమ్మకాలు
- కన్నెత్తి చూడని రెవెన్యూ యంత్రాంగం



జీవీఎంసీ 94వ వార్డు కృష్ణరాయపురంలో చెరువులో తప్పుడు పట్టాతో జనసైనికుడు చేపట్టిన నిర్మాణం

పెందుర్తి: 'ప్రజా ప్రతినిధులమైన మా ఫోటోలు కబ్జా స్థలాల్లో పెట్టుకుని.. మా పేరు చెప్పుకుని ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఎక్కడైనా ఇలాంటి పరిస్థితి ఉంటే మా దృష్టికి ప్రజలు తీసుకురావాలి. కబ్జాదారులు ఏ పార్టీ వారైనా ఉపేక్షించబోం. క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తాం. తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు భూ కబ్జాలపై కఠినంగా వ్యవహరించాలి'ఇటీవల పలు సందర్భాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేసిన వాఖ్యలు ఇవీ..

కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములను ఎమ్మెల్యే అనుచరులే చెరబడుతున్నారు. ప్రభుత్వ భూములు, గెడ్డలు చివరకు చెరువులను కూడా జనసైనికులు వదలట్లేదు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ప్రభుత్వ ఆస్తుల్లో జనసేన జెండా పాతుతున్నారు. ఓ వైపు కబ్జాలపై ప్రజల ముందు, మీడియా ముందు ఎమ్మెల్యే కన్నెర్రజేస్తుండగా.. మరోవైపు ఆయన అనుచరులే ప్రభుత్వ భూములను కాజేస్తుండడంతో ప్రజలు సైతం విస్తుపోతున్నారు. ఈ కబ్జాకాండకు రెవెన్యూ అధికారులు సైతం తమదైన శైలిలో ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

దర్జాగా కబ్జా

ప్రస్తుత ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అనుచర బృందంలో కీలకంగా వ్యవహరిస్తున్న పురుషోత్తపురానికి చెందిన ఓ వ్యక్తి అండతో ఓ జనసైనికుడు కృష్ణరాయపురం జ్యోతినగర్ చెరువులో పాగా వేశాడు. ఇక్కడ తప్పుడు పట్టాలతో స్థలాలను స్వాధీనం చేసుకుని షెడ్‌లు నిర్మించాడు. విద్యుత్‌శాఖ, జీవీఎంసీ అధికారులను 'మచ్చిక'చేసుకుని విద్యుత్ కనెక్షన్‌తో పాటు ఇంటి పన్ను కూడా వేయిస్తున్నాడు. ఆ షెడ్‌లను రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ధర నిర్ణయించి అమ్మకాలు సాగిస్తున్నాడు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, గెడ్డలను కబ్జాదారుల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

చెరువులో నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా నిర్మించిన షెడ్‌ను పరిశీలించాం. పట్టాను స్వాధీనం చేసుకుని నిర్ధారణ కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. తప్పుడు పట్టా అయితే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– శంకర్రావు, వీఆర్వో, కృష్ణరాయపురం

పర్యాటక కేంద్రంగా జామివాని చెరువు

- నియోజకవర్గంలో 'మోడల్'గా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల

పెందుర్తి: రాంపురంలోని జామివాని చెరువును థాన్ ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. వ్యవసాయానికి పూర్తిస్థాయిలో సహకారం అందించే ప్రక్రియలో భాగంగా అన్ని చెరువులను అభివృద్ధి చేసేందుకు నడుం బిగించామన్నారు. రాంపురంలో జామివాని చెరువు సాగు నీటి వినియోగదారుల సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువును అభివృద్ధి చేసేందుకు థాన్ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ప్రముఖ కంపెనీల ద్వారా సీఎస్ఆర్ నిధులు రావడానికి థాన్ ఫౌండేషన్‌కు తనవంతు సహకారం అందిస్తానని మాటిచ్చారు.

అభివృద్ధి కావాలంటారు.. మీరే అడ్డుకుంటారు

ఈ సందర్భంగా ఆయన వేపగుంట–పినగాడి రహదారి విస్తరణ అంశంపై కీలక వాఖ్యలు చేశారు. రోడ్డును బాగుచేయాలన్న ప్రజల కోరిక మేరకే 150 అడుగులకు విస్తరించేందుకు వీఎంఆర్‌డీఏ ద్వారా ప్రభుత్వం ప్రతిపాదన చేస్తే, తిరిగి అదే ప్రజలు దాన్ని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చేయకపోతే చేయలేదంటారు.. చేద్దామని సిద్ధమైతే అడ్డుకుంటారని ఆక్షేపించారు. ప్రజల కోరిక మేరకు కనీసం 100–120 అడుగులకు రోడ్డును కుదించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం రోడ్డును విస్తరిస్తున్నామని, ప్రజలు దీన్ని అడ్డుకుంటే మళ్లీ మళ్లీ రోడ్డు విస్తరణ ఉండదని స్పష్టం చేశారు. రోడ్డు కోసం ఇళ్లు, భూములు త్యాగం చేస్తే మిగిలిన భూములు, స్థలాలకు అధిక ధరలు వస్తాయన్నారు. ఓట్ల కోసమే ప్రజల అభ్యంతరాలను స్వీకరించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళుతున్నానని.. ప్రజల అభీష్టం మేరకే రోడ్డు విస్తరణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో కొల్లి వెంకటరావు, థాన్ ఫౌండేషన్ ప్రతినిధి వరప్రసాద్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ జామి గంగునాయుడు, నీటిపారుదల, డీఆర్‌డీఏ, ఇతర శాఖల అధికారులు, గ్రామపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

సందడిగా రాముల వారి తీర్థమహోత్సవం



తీర్థంలో మహిళల చిడతల భజన

పరవాడ: మండలంలో చింతల గొర్లివానిపాలెం శివారు దిబ్బల గొర్లివానిపాలెంలో రాముల వారి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామాలయంలో కొలువుదీరిన సీతారాములను గ్రామ సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడుతో పాటు భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవంలో భాగంగా రామాలయంలో భజన చెట్టు వద్ద భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు నిర్వహించిన చిడతల భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌తో ఇబ్బందులు



ఆందోళన చేస్తున్న సర్పంచ్ దూది విజయలక్ష్మి, గ్రామస్తులు

పెందుర్తి: వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించినట్లు అడవివరం–చెక్‌పోస్టు రోడ్డు విస్తరణ జరిగితే తమ గ్రామస్తులు తీవ్రంగా నష్టపోతారని సౌభాగ్యరాయపురం(ఎస్ఆర్ పురం) సర్పంచ్ దూది విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వీఎంఆర్‌డీఏ ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ 200 అడుగుల రోడ్డుకు వ్యతిరేకంగా గ్రామంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తరతరాలుగా నివాసాలు, దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఇక్కడ జీవనం సాగిస్తున్న ప్రజల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే ప్రమాదముందన్నారు. అంతేకాకుండా గ్రామానికి కుడి వైపున అంతా అటవీ భూములు ఉండడంతో విస్తరణ అంతా గ్రామం వైపు ఉంటుందని.. దాని వలన ఎస్ఆర్ పురం కాలనీలో చాలా నివాసాలు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వీఎంఆర్‌డీఏ అధికారులు పునరాలోచన చేసి గ్రామస్తులకు తగు న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.


పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య



పఠాన్ వలీసా మృతదేహం

పెందుర్తి: స్థానిక పెద్ద చెరువు సమీపంలో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. వివరాలివి.. స్థానిక పెద్ద చెరువులో వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు మంగళవారం ఉదయం స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహం సమీపంలో ఉన్న ఆధారాలను బట్టి విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన పఠాన్ వలీసా(25)గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో అతడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆధార్‌కార్డులో ఉన్న వివరాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్షణ గోడల్లేని వంతెనతో ఇబ్బందులు



వెన్నలపాలెం రహదారిలో రక్షణ గోడలు లేని వంతెన

పరవాడ: ఎన్టీపీసీ–వెన్నలపాలెం రహదారిలో రక్షణ గోడలు లేని వంతెనతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీపరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. చీకటి పడితే చాలు వంతెన దగ్గరకు వచ్చేసరికి భయపడాల్సిన పరిస్థితి. అంధకారంలో ఉన్న రహదారిలో పలు చోట్ల రక్షణ గోడలు లేని వంతెనలతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రక్షణ గోడలు లేని వంతెన వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెపుతున్నారు. ఇక్కడి వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం కనిపించలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనపై రక్షణ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.